www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 20 డిసెంబర్ 2023 5 కాకినాడ




ఓటర్ నమోదుకు 201 దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నూతనంగా ఓటర్ నమోదుకు 201 దరఖాస్తులు వచ్చాయని ఇఆర్ఒ, ఆర్‌డిఒ జె. సీతారామారావు తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, మరణించిన వారికి సంబంధించి 210 దరఖాస్తులు వచ్చాయన్నారు. నియోజకవర్గ పరిధిలో మార్పులు, సవరణలకు సంబంధించి 293 దరఖాస్తులు వచ్చాయని, వీటికి సంబంధించిన క్లైములు, అభ్యంతరాలను వెంటనే ఆన్‌లైన్ చేసి వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గవరసాన సూరిబాబు(వైసిపి), రంది సత్యనారాయణ(టిడిపి), నీలపాల సూరిబాబు(సిపిఎం) తదితరులు పాల్గొన్నారు.

వంటింట్లో తుపాను మంట

- ఉద్యాన పంటలను ముంచెత్తిన మిచౌంగ్
- అమాంతం పెరిగిన కూరగాయల ధరలు
- సామాన్యులపై రెట్టింపు భారం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మిచౌంగ్ తుపాను ఉద్యాన పంటలను నాశనం చేయడంతో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. ఉన్నఫలంగా కూరగాయల ధరలు రెట్టింపు అయ్యాయి. దీంతో సామాన్యులకు వంటింట్లో మంట తప్పడం లేదు. జిల్లాలో ఈనెల 4 నుంచి వరుసగా మూడు రోజులపాటు తుపాను ప్రభావంతో వర్షాలు ముంచెత్తాయి. ఉద్యాన శాఖ అధికారుల లెక్కల ప్రకారం గొల్లప్రోలు మండలం తాడిపత్రి, చేబ్రోలు, వన్నెపూడి, చందుర్తి, ఏ.విజయనగరం, చిన్న జగ్గంపేట, కొడవలి, దుర్గాడ, పిఠాపురం మండలం వి.దొంతమూరు, వరాధవపురం, విరవాడ, విరవ, రాపర్తి, కుమారపురం, కోలంక, చిత్రాడ, మల్లం, యు.కొత్తపల్లి మండలం ఎండపల్లి, కొండవరం, కొమరగిరి, గోర్స, పెద్దాపురం మండలం ఆర్బిపట్నం, వి.తిమ్మాపురం, జె.తిమ్మాపురం, కట్టమూరు, కాండ్రకోట, తిరుపతి, ఉలిమేశ్వరం, గుడివాడ, జగ్గంపేట మండలం సీతానగరం, మామిడాడ, ఇర్రిపాక, కాట్రావులపల్లి, గొంప్రంపాలెం, బలబద్రపురం, ఇంకా కాజులూరు, గండేపల్లి, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి, తాళ్లూరు, కోటనందూరు, శంకవరం, రౌతులపూడి తదితర మండలాల్లో 117 గ్రామాల్లో సుమారు 2,400 ఎకరాల్లో ఉద్యాన, కూరగాయల పంటలకు నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. టమోటా, క్యాబేజీ, బెండ, వంగ, బీర తదితర పంటలు వర్షాలకు తుడిచి పెట్టుకుపోయాయి. ఇందులో 981 మంది రైతులకు చెందిన సుమారు 1200 ఎకరాల్లో కూరగాయల పంటలు పూర్తిగా నాశనం అయ్యాయి. మార్కెట్‌లోకి స్థానికంగా సాగైన కూరగాయలు రాకపోవడంతో గత వారం రోజులుగా వీటి ధరలు అమాంతం పెరిగాయి. మొన్నటి వరకు కార్తీక మాసం వలన ధరలు పెరగ్గా కార్తీకమాసం పూర్తి కావడంతో కూరగాయలు ధరలు దిగివస్తాయని అనుకున్న సామాన్యులకు తుపాను షాక్ ఇచ్చింది. సాధారణంగా కార్తికమాసంలో కూరగాయలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. పూజలు, వ్రతాలతోపాటు మాలధారుల సంఖ్య పెరగటం, అన్న సమారాధనలు వంటివి ఉండటంతో మిగతా రోజుల కంటే ఈ నెలలో కూరగాయల ధరలు సాధారణంగా పెరగడం ఆనవాయితీగా వస్తుంది. అయితే డిసెంబరు మొదటి వారంలో తుపాను ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో చేతికి అందివచ్చే పంటలు నేల మట్టం అయ్యాయి. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో సామాన్యుల ఇళ్లల్లో కూరగాయలు వండుకోవడానికి గత్యంతరం లేని పరిస్థితులు నెలకొన్నాయి. గంజి, చారు నీళ్లతో పూట గడుపుకోవాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలను నియంత్రించాలని కోరుతున్నారు.

కూరగాయల ధరలు ఇలా

కూరగాయలు	తుపాను ముందు(రూ)	తుపానుకి తర్వాత(రూ.)
చిక్కుడు	60	100
క్యారెట	40	60
దొండ	40	60
బెండ	40	80
వంకాయ	40	80
ఆనపకాయ	20	40
ఖాళీ ఫ్లవర్	20	40
టమోటా	30	40
మునగ(4)	60	80



భవనాల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఇతరులు

పలు అభివృద్ధి భవనాల ప్రారంభం

ప్రజాశక్తి - అన్నవరం

వీర వెంకట సత్యనారాయణ దేవస్థానంలో రూ.20 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి భవనాలను మంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి దేవస్థానం అధికారులు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. తొలుతగా సత్యదేవునిని దర్శించుకున్నారు. వేద ఆశీస్సులు నిర్వహించి స్వామివారి జ్ఞాపికను ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం మంత్రి భక్తులకు వసతి సౌకర్యం కోసం శివసదన్ సత్రం సముదాయాన్ని, ఆదిశంకర వనదుర్గ హరిహర మార్గ్ అంతర్గత రహదారుల నిర్మాణాలను, రత్నగిరి కొండ సుదూర ప్రాంతంలో కనిపించే విధంగా విద్యుత్ అలంకరణతో కూడిన శంకు, చక్ర నామాలు, రత్నగిరి ఉచిత విశ్రాంతి భవనం, కొండ దిగువన సత్యనారాయణ యాత్ర నివాస్ సముదాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అన్నవరం దేవస్థానానికి రోజు రోజుకి భక్తులు అధిక సంఖ్యలో వస్తుండడంతో వారి అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, పాలకమండలి సభ్యులు, ఇంజనీరింగ్ మరియు ఎలక్ట్రికల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఓటుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ

ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం ఉదయం 9 గంటలకు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఒ, కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు తెలిపారు. స్థానిక రాజా ట్యాంక్ పార్క్ ఆవరణలోని కళాక్షేత్రం నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ప్రారంభిస్తారన్నారు. ర్యాలీ నిర్వహణపై మంగళవారం తన ఛాంబర్ లో కార్పొరేషన్ అధికారులు, ఎఇఆర్ఒలతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజా ట్యాంక్ నుంచి టూ టౌన్ పోలీస్ స్టేషన్, టౌన్ హాల్, మసీద్ సెంటర్, గోల్డ్ మార్కెట్ సెంటర్ జగన్నాధపురం వంతెన, ఎన్‌టిఆర్ వారధి, దేవాలయం వీధి, త్రిపుర సుందరి ఆలయం, టూ టౌన్ ఓవర్ బ్రిడ్జ్ మీదుగా భానుగుడి జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఓటు ప్రతి ఒక్క పౌరుని హక్కు- బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు స్థానిక ఆనందభారతి గ్రౌండ్స్‌లో రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని కూడా ఓటర్లలో చైతన్యం కల్పించేందుకేనని స్పష్టం చేశారు. రంగవల్లుల పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన మహిళలు కార్పొరేషన్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990 నెంబర్ ను సంప్రదించి బుధవారం సాయంత్రం లోపుగా పేర్లు నమోదు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, నగరపాలక సంస్థ మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఒ మానే కృష్ణ మోహన్, ఎఇఆర్ఒ మురళీకృష్ణ, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇంటింటికీ కుళాయి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలే కుర్రు జగనన్న కాలనీలో రూ.26 లక్షలు, పెదవలసలో రూ. 20 లక్షలు, గాడిమొగలో రూ.40 లక్ష లతో నిర్మించనున్న వాటర్ ట్యాం కులకు ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జల జీవన్ మిషన్ నిధుల ద్వారా జగనన్న కాలనీలోని ప్రతి ఇంటికి కులాయి వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత గంగాధర్, జడ్‌పిటిసి సాగర్, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, స్థానిక సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, మాతరాజు, కాదా గోవింద కుమార్ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ సతీష్‌కుమార్

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఎపిఐఐసి కాలనీలో విశ్రాంత తహశీల్దార్ రేలంగి బాపిరాజు సౌజన్యంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త వేదుల శ్రీరామ శర్మ మాట్లాడుతూ అన్ని గుణాల్లో త్యాగగుణం ఉత్తమమైందని, దీనికి మించిన ధనం, దానాన్ని మించిన గుణం లోకంలో ఏది లేదని అన్నారు. పరోపకారం సంతృప్తినిస్తుందని నమ్ముతూ ప్రతి నెల దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు అందిస్తున్న బాపిరాజు సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న బాపిరాజు



ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

అండర్ -14 రగ్బీ పోటీలకు అజయ్ ఎంపిక

ప్రజాశక్తి - కరప

మండలంలోని గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విత్తనాల అజయ్ రగ్బీ పోటీలకు ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎ.సాయి మోహన్ ఆ విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ ఒరిస్సా రాష్ట్రంలోని నవీన్ పట్నాయక్ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్ 14 రగ్బీ క్రీడా పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున విత్తనాల అజయ్ ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ పోటీల్లోనూ ఉత్తమంగా రాణించి గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాద్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగలింగేశ్వరరావు, వివి.రమణమూర్తి అజయ్‌ని అభినందించారు. చదువుతోపాటు, క్రీడల్లోనూ ఉత్తమంగా రాణించాలని వారు ఆకాంక్షించారు.

అంగన్‌వాడీల బిక్షాటన..వంటా వార్పు



పిఠాపురంలో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ న్యాయమైన హక్కుల కోసం అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటం మంగళవారం నాటికి 8వ రోజుకు చేరింది. రోజు రోజుకీ ఉద్యమాన్ని ఉధృతం చేసే క్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో అంగన్‌వాడీలు బిక్షాటనతోపాటు, రోడ్లపైనే వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. **కాకినాడ** స్థానిక ఇంద్రపాలెం లాకుల వద్ద గల అంబేద్కర్ విగ్రహం సెంటర్లో జరుగుతున్న అంగన్‌వాడీల ధర్నా శిబిరం వద్ద వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారం చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. 8 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు రూ.18 వేలు ఇస్తానని ప్రకటించడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో కూడా పక్క రాష్ట్రంలో అమలు చేసే జీతాలకు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. శిబిరం వద్ద ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీరజ, జ్యోతి, రమ, జిల్లా కోశాధికారి జి.రమణమ్మ, మున్ని, సరోజ, వంగారమ, జోగమ్మ, వీరమనీ, చామంతి, పి లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం:** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మె మంగళవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ప్రాజెక్టు కార్యాలయం నుంచి ఉప్పాడ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు డి.పద్మ, తులసి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని గత ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలన్నారు. తెలంగాణ కంటే అదనంగా జీతాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. గ్రాడ్యూటీ ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కరణం విశ్వనాథం, అంగన్‌వాడీలు విజయ శాంత, ప్రజావాణి, అమల తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మున్సిపల్ సెంటర్ వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల ధర్నా శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వ్యవస్థ చరిత్రలో నిరవధిక సమ్మె జరగడం ఇదే ప్రధానమని, ఇందుకు సిఎం జగన్ బాధ్యత వహించాల్సివుంటుందన్నారు. రాజన్న రాజ్యం అంటే జనాల్ని రోడ్డున పడేటమేనా?అని ప్రశ్నించారు. పెద్దాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం (మణి)ఆధ్వర్యంలో న్యాయవాదులు సమ్మె శిబిరం వద్దకు వచ్చి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దాడి బేబీ, అమల, నాగమణి, ఫాతిమా, ఎస్తేరు రాణి, కాలే దేవి,పద్మ, వరలక్ష్మి, నాగరత్నం, జె.కుమారి, సావిత్రి, స్నేహలత, సిఐటియు నాయకులు బి.క్రాంతి కుమార్, ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు. **కిర్లంపూడి** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ఆందోళన కొనసాగింది. కార్యాలయం వద్దే వంట వారు కార్యక్రమాన్ని నిర్వహించారు. బిక్షాటన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించారు. సిఐటియు మండల కన్వీనర్ క్రాంతి కుమార్ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షు రాలు సిహెచ్.రత్నం, సిఐటియు అధ్యక్షుడు టి.జీవ, పి.సావిత్రి, షేక్ పరివిన్, జి.రత్నం, పి.మంగాయమ్మ, పి.ప్రభావతి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు. **కరప** స్థానికంగా జరుగుతున్న ఈ ధర్నాలో సెక్టర్ నాయకు రాలు పి.వీరవేణి, ఎస్.వరలక్ష్మి ఆధ్వర్యంలో వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి, సిఐటియు జిల్లా కోశా ధికారి ఎంవి.రమణ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమస్యను సానుకూలంగా స్పందించని పక్షంలో సిఐటియు అనుబంధ సంఘాలన్నీ పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని గమనించుకోవాలని హెచ్చరించారు. ఆశ వర్కర్లు ఆర్.వెంకటలక్ష్మి, కె.సత్య మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఎం.భవాని, నారాయణమ్మ, జ్యోతి, కల్పలత, లక్ష్మి, దేవి, మనోజ, సాయి దుర్గ, భవాని పాల్గొన్నారు. **పెదపూడి** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన కార్యక్రమంలో వంటా వార్పు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు పాల్గొని మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకు రాలు రాజేశ్వరి, అంగన్‌వాడీలు ఎ.కనకదుర్గ, జి.సత్యవతి, వి.భారతి, జి.లలిత, కుమారి, బి.అరుణ, సత్యవేణి పాల్గొన్నారు. **తాళ్లరేవు** తహశీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించి సామూహిక భోజనాలు చేశారు. ఈ సమ్మె శిబి రాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు వళ్ల రాజుబాబు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు విప్పర్తి శ్రీనివాస్, పులప కూర గోపాలకృష్ణ, విశ్వజన కళామండలి నాయకులు వడ్డి ఏడు కొండలు పాల్గొని మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.పద్మజ, పి.ఉషారాణి, అరుణ పాల్గొన్నారు.



తాళ్లరేవులో వంటా వార్పు చేస్తున్న అంగన్‌వాడీలు



కిర్లంపూడిలో బిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు



పెదపూడిలో సమస్యలపై సాంఘీక నాటక ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



సారు ఎన్ని అప్పులు చేసినా చీమకుట్టినట్టయినా వుండదేం..!!!

భూ హక్కు చట్టం రద్దు చేయండి



రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు


ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టం - 27/2023 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. బార్ అసోసియేషన్ కార్యాలయం నుంచి మున్సిపల్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం మున్సిపల్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం(మణి) మాట్లాడుతూ ఈ చట్టం వల్ల పేద, అట్టడుగు, దళిత గిరిజన వర్గాల తీవ్రమైన ఇబ్బందులు పడతారన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి కందుల నరేష్ కుమార్, సం యుక్త కార్యదర్శి మడికి రాంబాబు, న్యాయవాదులు ఎస్.నరసిం హారావు, డివిఎస్ఎస్. రామ చంద్రరావు, బొర్రా పద్మాసిని, విశాలాక్షి, మానవ హక్కుల సం ఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ పాల్గొన్నారు. ఈ ఆందోళ నకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు మద్దతు తెలిపారు.

లేనిపోని అభియోగాలు మానుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తన గ్రామ పర్యటనకు వచ్చిన జనసేన పార్టీ నాయకుడు పంతం నానాజీ తనపై లేనిపోని అభియోగాలు చేశారని, ఇటువంటి విమర్శలు మానుకోవాలని జడ్‌పిటిసి, వైసిపి మండల అధ్యక్షుడు నూరుకురి రామకృష్ణ(కిట్టు) అన్నారు. ఆయన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన గ్రామంలో పర్యటించిన పంతం నానాజీ పేదలకు పట్టాలు ఇచ్చేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.60 వేలు తీసుకున్నట్లు లేనిపోని ఆరోపణలు చేశారని, ఇటువంటి తప్పుడు ప్రచారం చేయడం ఆయనకు తగదన్నారు. వలసపాకల గ్రామంలో పారిశుధ్యం కుంటుపడిందని డ్రైయిన్లు, రోడ్లు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంఎల్ఎ కురసాల కన్నబాబును పదే పదే విమర్శలు చేస్తున్నారని, నిద్రట్లోనూ ఆయనకు కన్నబాబునే కలవరించడం పరిపాటిగా మారిందన్నారు. జనసేన జెండాను పట్టుకుని తన గ్రామంలో పర్యటస్తున్న ఆయనకు స్థానికంగా పట్టుమని 10 మంది కార్యకర్తలు కూడా లేకుండా పోయారంటే ఆయన స్థాయి ఏపాటిదో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాకినాడలో ఎంఎల్ఎగా పోటీ చేసిన సమయంలో జడ్‌పిటిసిగా తనకు వచ్చిన మెజారిటీ ఓట్లు కూడా నానాజీకి రాలేదని, అటువంటి వ్యక్తి తనపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పేకాడితనే ఇంట్లో పొయ్యి వెలిగేదని ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అన్నప్పుడు నానాజీ ఏమి చేశారని ప్రశ్నించారు. వలసపాకల గ్రామ జనసేన అధ్యక్షుడిగా స్థానికుడిని నియమించుకోలేని దౌర్భాగ్యం పరిస్థితిలో ఆయన ఉండటం బాధాకరమన్నారు. ఇకపై ఏ వ్యక్తినైనా దూషించేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడితే మంచిదని సలహా ఇచ్చారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు ధూళిపూడి రెడ్డి నాయుడు, గుత్తుల కష్ణంరాజు, పొన్నాడ విశాఖ కుమార్, కేత శ్రీనివాసరావు, దంగేటి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నూరుకురి రామకృష్ణ

శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కోటనందూరు

రామానుజన్ గణిత ప్రతిభా పరీక్షల్లో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకున్నారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. విద్యార్థుల్లో దాగిఉన్న గణిత ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు ప్రతియేటా రామానుజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ రామచంద్రాపురం వారిచే రామానుజన్ గణిత ప్రతిభా పరీక్ష రెండు స్థాయిలలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సంవత్సరం సెప్టెంబర్ 24 న ప్రథమ స్థాయిలో విద్యార్థులకు పరీక్ష నిర్వహించారని, ప్రథమ స్థాయిలో అర్హత సాధించిన విద్యార్థులు ద్వితీయ స్థాయికి ఎంపిక అవుతారని తెలిపారు. ఈ ద్వితీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు నవంబర్ 19న 34వ రామానుజన్ జాతీయ గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారని, ఈ పరీక్షలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు మాచినేని అపూర్వ(7వ తరగతి), ముత్యాల విశ్రుత్(4వ తరగతి) జిల్లా స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించారని ఆయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



పథకాలతో విద్యార్థులు

రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రోగ నిరోధక శక్తి లోపించిన కారణంగా పలు వైరస్లు విజంభించడంతోపాటు కీళ్ల సమస్యలు వేధించే అవకాశం ఉందని డాక్టర్ సువర్ణ రాజు అన్నారు. ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపం, మానసిక ఒత్తిడి కారణంగా కీళ్ల నొప్పులు కూడా వేధిస్తాయని అన్నారు. ఇప్పుడు మరలా కరోనా వైరస్ కేసులు కూడా కేరళ రాష్ట్రంలో పెరుగుతున్నందున ప్రతి ఒక్కరు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని అన్నారు.

నేరాలు ఘోరాలు



బెల్ట్ షాపుపై పోలీసులు దాడి
60 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

మండలంలోని వేట్లపాలెంలోని జొన్నలదొడ్డి ప్రాంతంలో మద్యం బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేశారు. పోలీసులకు అందిన ముందస్తు సమాచారంతో భక్తుల సత్యనారాయణకు చెందిన మద్యం బెల్ట్ షాపులో విక్రయించేందుకు సిద్ధం చేసిన 60 మద్యం బాటిల్ను స్వాధీనం చేస్తున్నట్లు సామర్లకోట సిఐ సురేష్ మంగళవారం తెలిపారు. మద్యం బాటిల్‌ను ఉంచిన షాపు యజమానిని అరెస్టు చేసి కాకినాడ కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి
ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం నందు పేకాట నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు మంగళవారం ఆకస్మికంగా దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో వారి వద్ద నుంచి రూ.2700 రూ.నగదు తోపాటు ఐదు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. పల్లిపాలెం లో పేకాట నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ట్రైనీ డిఎస్ఐ విష్ణు స్వరూప్ స్థానిక ఎస్ఐ ఎస్ శివప్రసాద్ ల ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 7 వ్యక్తులు పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసి స్థానిక కోర్టులో హాజరు పరిచినట్లు ట్రైనీ డిఎస్పి తెలిపారు.

వ్యాన్‌లో షార్ట్ సర్క్యూట్
డ్రైవర్ సజీవ దహనం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మినీ వ్యాన్‌లో షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో ఒక వ్యక్తి సజీవదహనం అయ్యాడు. ఈ సంఘటన కాకినాడ రూరల్ మండలం వాకలపూడి ఇండస్ట్రియల్ ఏరియాలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన బాలరాజు (70) వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో వాకలపూడి గ్రామం ఇండస్ట్రీయల్ ఏరియాలో ఉన్న సంతోషి మాత ఆయిల్ కంపెనీకి లోడు నిమిత్తం మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఈ నేపథ్యంలోనే మినీ వ్యాన్‌లో షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు చెలరేగాయి. డోర్ తెరుచుకోకపోవడంతో వ్యాన్ డ్రైవర్ బాలరాజు సజీవదహనం అయ్యాడు. సంఘటనా స్థలాన్ని డిఎస్పి మురళీకృష్ణా రెడ్డి, తహశీల్దార్, సర్పవరం సిఐ ఆకుల మురళీ కృష్ణ పరిశీలించారు.

ఆహార కల్తీపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఇటీవల ఆహార పదార్థాలు కల్తీవి కావడంతో పలువురు దీర్ఘకాలిక రోగాలకు గురవుతున్నందున అప్రమత్తంగా ఉండాలని జిల్లా వినియోగదారుల సమాఖ్య కార్యదర్శి కొమ్మూరి శ్రీనివాసరావు సూచించారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిటర్జెంట్ పౌడి, యూరియా తదితర పదార్థాలతోకృత్రిమ పాలును తయారు చేస్తున్నారని అన్నారు .తేనెలో బెల్లం పాకం, టీ పొడిలో రంపపు పొట్టు, కాఫీ పొడిలో చింతపిక్కల పొడి వంటివి కలుపుతున్నారని తెలిపారు. వీటివల్ల గుండె, కాలేయం, మూత్రపిండాలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. కల్తీ ఆహార పదార్థాలు తక్కువ ధరలో లభిస్తుండడంతో పలువురు వాటి పట్ల ఆకర్షితులై రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ఆహార కల్తీ నిరోధక చట్టం 1954 ప్రకారం కనీసం ఆరు నెలలు గరిష్టంగా మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధించడంతోపాటు రూ.1000 జరిమానా విధిస్తారని అన్నారు. కల్తీ ఆహార పదార్థాలను గుర్తిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవ రావు, రాజా పాల్గొన్నారు.

మహిళలకు
విజయ ఫౌండేషన్ చేయూత



మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న విజయబాబు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా విజయ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎస్.విజయబాబు మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలవాలని కోరారు. సిఆర్‌సి ఫోర్స్ ఇండియా ఛైర్మన్ జి.పాల్ ప్రసాద్ మాట్లాడుతూ తక్కువ ఫీజులతో మంచి వైద్యం అందజేయడంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ స్వర్ణలత, గ్లోరీ మినిస్ట్రీ ప్రతినిధులు సమర్పణ రావు, బేతేలు మినిస్ట్రీ ప్రతినిధులు డేవిడ్ రాజు, ఎస్‌వి. ప్రభాకర్, రౌతు సహదేవుడు, కోరాడ నారాయణరావు, సిరిపురపు బాబురావు, కుంచె తాతాజీ మహిళలు ఉన్నారు.

బాలోత్సవంతో సృజనాత్మకత వెలికితీత

బ్రోచర్ ఆవిష్కరణలో వక్తలు



బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆహ్వాన సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలోత్సవం కార్యక్రమం దోహదం చేస్తాయని పలువురు వక్తలు అన్నారు. గోదావరి బాలోత్సవం 2వ పిల్లల పండుగను జనవరి 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన సంఘం బ్రోచర్ ఆవిష్కరణ సభ మంగళవారం సాయంత్రం 6 గంటలకు రాజమహేంద్రవరంలోని హోటల్ షెల్టాన్‌లో జరిగింది. ఈ సభకు సీనియర్ పాత్రికేయులు కృష్ణకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా తిరుమల విద్యాసంస్థల అధినేత, గోదావరి బాలోత్సవం అధ్యక్షులు నున్న తిరుమలరావు హాజరై మాట్లాడారు. పిల్లలో సృజనాత్మకతను వెలికితీయడానికి బాలోత్సవాలు దోహదం చేస్తాయన్నారు. డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ బాలోత్సవాలను ప్రోత్సహిం చాలన్నారు. దీనికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సిసిసి అధినేత పంతం కొండలబ రావు మాట్లాడుతూ రాజమహేం ద్రవరంలో జరిగిన గత బాలోత్సవం చాలా బాగా జరిగిందన్నారు. ఈ ఏడాది కూడా అంతే ఘనంగా నిర్వహిం చాలన్నారు. దీనికి తనసహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నిర్వాహకులు గుబ్బల రాంబాబు, మాటూరు సిద్దార్థ, స్వామి యాడ్స్ అధినేత జి.భాస్కర్, గోదావరి బాలోత్సవం నిర్వాహకులు పిఎస్ఎన్.రాజు, పి.తులసి, జె.రూపస్, డాక్టర్ చైతన్య శేఖర్‌లు మాట్లాడారు. ఈ సభకు నగరంలోని ప్రముఖులు, టీచర్స్ , రిటైర్డ్ ఉద్యోగులు, బాలోత్సవం నిర్వాహకులు పాల్గొన్నారు. తొలుత గోదావరి బాలోత్సవం గౌరవాధ్యక్షులు, పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతికి సమావేశం సంతాపం తెలియజేసింది.

జగన్‌తోనే సంక్షేమ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాష్ట్రంలో సంక్షేమ పాలన సిఎం జగన్‌తోనే సాధ్యమని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. పి.మల్లవరం గ్రామం సచివాలయం-1 పరిధిలో వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమం ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. అభివృద్ధి, సంక్షేమ ఫలాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైసిపి జెండాను గ్రామ పార్టీ కన్వీనర్ పిల్లి.వీరనాగు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్నా జన్నార్ధనరావు, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపిటిసి సభ్యులు దున్నా రాంబాబు, గంగాధర్ మాట్లాడారు. ప్రతి ఇంటికి మేలు జరిగిందని భావిస్తే జగన్‌ను మరోసారి సిఎంను చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బల్ల ప్రసాద్, దడాల ప్రసాద్, తులసి, ఇఒపిఆర్‌డి మల్లాడి బైరమూర్తి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు కీలకం



అవగాహన ర్యాలీలో ఆర్‌డిఒ, డిఎస్‌పి, తదితరులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు వినియోగం కీలకమని ఆర్‌డిఒ జె. సీతారామారావు, డిఎస్‌పి లతాకుమారి అన్నారు. మంగళవారం ఓటు హక్కు ప్రాముఖ్యతపై పెద్దాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహారాణి కళాశాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మున్సిపల్ సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం మున్సిపల్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ఆలోచనత్మకంగా సద్వినియోగం చేసుకుంటే మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, సిఐ రవికుమార్, ఎస్ఐ వి.సురేష్, ఎంఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.వీరయ్యచౌదరి, డిటి కాంతారావు, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు సిహెచ్.ఏసుబాబు, ఎం.తాతాజీ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు చేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి

యువ ఇంజినీర్లు తమ సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టి నూతన ఆవిష్కరణలను వెలుగులోకి తేవాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హేక్‌థాన్ 2023 గ్రాండ్ ఫినాలే ఉత్సాహంగా మంగళవారం ప్రారంభమైంది. దేశమంతటా 47 నోడల్ కేంద్రాల్లో ఏకకాలంలో ఈ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. న్యూఢిల్లీలో ప్రారంభమైన కార్యక్రమానికి ఎఐసిటిఇ ఛైర్మన్ ప్రొఫెసర్ టిజి.సీతారాం అధ్యక్షత వహించారు. ఆదిత్య క్యాంపస్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో "యుక్తి" అంకుర సంస్థ వ్యవస్థాపకుడు ప్రణవ్ దీక్షిత్, ఐ4సి కంపెనీ మేనేజర్ సౌరభ్ ఉబాలే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువ ఇంజనీర్లు మంగళవారం ఉదయం నుంచి బుధవారం రాత్రి వరకూ నిర్విరామంగా తమ సృజనాత్మక ఆలోచనలకు పదునుపెడుతు నూతన ఆవిష్కరణలు ప్రపంచం ముందుకు తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన ఆవిష్కరణలతో దేశవ్యాప్తంగా ఉన్న భావి ఇంజనీర్ల ప్రతిభను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో దేశం నలుమూలల నుంచి 89 మందితో కూడిన మొత్తం 27 బృందాలు పాల్గొన్నాయి.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో. ఆర్డినేటర్ ఎ.లక్ష్మణరావు, డీన్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్.జెడి.వెంకటేష్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రణవ్ దీక్షిత్, సౌరభ్ ఉబాలే, శ్రీనివాసరెడ్డి



యువ ఇంజనీర్ల నూతన ఆవిష్కరణలను పరిశీలిస్తున్న నిర్వాహకులు




బెంగుళూరులో పాల్గొన్న ఆదిత్య విద్యార్థులు

బెంగుళూరులో ఆదిత్య విద్యార్థులు

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఐటి విభాగం విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 గ్రాండ్ ఫినాలే పోటీల్లో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు ఎన్.శ్రీను వినయ్ కుమార్, ఎవి.సత్యగంగా వేణి, ఎన్.చక్రవర్తి, ఎన్‌బిఎన్ ఎస్.గౌతమ్, వై.నిష్కల, పి.సంతోష్ మణికంఠ పాల్గొన్నారని, మెంటర్‌గా ప్రొఫెసర్ ఎకె.చక్రవర్తి వ్యవహరిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తమ ప్రాజెక్టు నందు స్మార్ట్ ఎడ్యుకేషన్ ఆన్‌లైన్ పర్సనలైజ్డ్ లెర్నింగ్ రికమండేషన్/ట్యూటరింగ్ టూల్, సెర్చ్ ఫర్ బెస్ట్ టీచర్ ఫర్ స్పెసిఫిక్ టాపిక్ అనే అంశంపై కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రత్తిపాడు వైసిపి టికెట్ వరపులకేనా?



ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు నియోజక వర్గ వైసిపి టికెట్ విషయంలో పలు మార్పులు చోటుచేసు కుంటు న్నాయి. సిట్టింగ్ ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ స్థానిక నాయకులతో సమన్వ యం కోల్పో యారని ఆరోపణతో ఆయనకు అధి ష్టానం టికెట్ లేదని సంకేతాలు ఇచ్చింది. తొలుత ఎంఎల్ఎ సమీప బంధువు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మాజీ మంత్రి అన్న కుమార్తె పర్వత జానకి దేవికి టికెట్ ఇస్తారని సోషల్ మీడియాలో పుకార్లు షికారులు చేశాయి. అయితే అనూహ్యంగా తాడేపల్లి పాలస్ నుంచి మాజీ ఎంఎల్ఎ, వైసిపి సీనియర్ నేత వరుపుల సుబ్బారావుకి సోమవారం సాయంత్రం ఫోన్ రావడంతో అందరు అంచనాలు తారుమ రయ్యాయి. వరుపుల సుబ్బారావు గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంఎల్ఏగా విజయం సాధించారు. 2014లో వైసిపి నుంచి రెండోసారి ఎంఎల్ఏగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో మాత్రం అనూహ్యంగా పర్వత ప్రసాద్ బరిలో నిలిచి టెక్కెట్‌ను తెచ్చుకుని విజయం సాధించారు. ఆయన గెలుపులో వరుపుల సుబ్బారావు కీలకపాత్ర పోషించారు. సీని యారిటి, పార్టీ విజయంలో కీలక పాత్రలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుతం నియోజకవర్గ ఇన్ ఛార్జ్‌గా వరుపుల ను నియమిం చేందుకు పార్టీ అధి ష్టానం నిర్ణయం తీసు కున్నట్లు ప్రచా రం జరుగు తోంది. సిట్టింగ్ ఎంఎల్ఎ పర్వత ప్రసాద్ ఆయన సమీప బంధువు అయిన జానకి దేవికి ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగిం చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించి నట్లు, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం సైతం వరుపుల సుబ్బారావుకి టికెట్ ఇవ్వాలని సూచించినట్లు సమా చారం. ఏదిఏమైనా ప్రత్తిపాడు వైసిపి టికెట్ విషయంలో పలు నాటకీయ పరిణామాలు చోటు చేసుకుం టున్నాయి. దిగువ స్థాయి నాయకత్వం పర్వత ప్రసాద్‌కే టిక్కెట్ ఇవ్వాలని కోరుతుంది. ఇప్పటికే వరుపుల వెంట నడిచిన ఏలేశ్వరం, రౌతులపూడి ఎంపిపిలు, ఇతర ప్రజాప్రతి నిధులు టిడిపిలో చేరిపోయారు. వరు పులకు టిక్కెట్‌ను ఇస్తే వారు తిరిగి సొంతగూటికి చేరుకుంటారా? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి.

యోగా ఛాంపియన్స్‌కు కమిషనర్ అభినందన



విజేతలను అభినందిస్తున్న నగర కమిషనర్ నాగ నరసింహారావు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రపంచ కప్ యోగా ఫైనల్ పోటీల్లో సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్ సాధించిన కంబాల భాస్కర్ వెంకట సాయిరామ్, గంపల లహరి దుర్గ, శిక్షణ అందించిన జాతీయ యోగా కోచ్ ధర్మాడి దుర్గా శాంత ప్రసాద్‌లను కమిషనర్ నాగ నరసింహారావు అభినందించారు. మంగళవారం స్మార్ట్‌సిటీ భవన్ సమావేశ మందిరంలో కాకినాడ నగర కార్పొరేషన్ అధ్వర్యంలో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-18 బాలుర విభాగంలో భాస్కర్ సాయిరాం, అండర్-14 బాలికల విభాగంలో లహరి దుర్గలు ఈ ఘనత సాధించి రాష్ట్రానికే గర్వకారణంగా నిల్చారని అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ కప్ యోగా విజేతలు భాస్కర్, లహరి దుర్గ, జాతీయ యోగా కోచ్ దుర్గా శాంత ప్రసాద్ లను దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న, ఎపి యోగ విద్యా పీఠం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ యోగా గురువు చిట్టూరి చిట్టిబాబు లు పోల్గొన్నారు. విజేతలుకు ఉదయ భానోజీ, మండపాక సూర్యనారాయణ మూర్తి, సర్వేశ్వరరావు, రామకష్ణ, విజయలక్ష్మీ, పరమేశ్వర రావు అభినందనలు తెలిపారు.

21న మెగా రక్తదాన శిబిరం



ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

ఈ నెల 21వ తేదీ గురువారం సిఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా పెద్దాపురం పట్టణంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, పెద్దాపురం వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు చెప్పారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 'రక్తదానం చెద్దాం ప్రాణ దాతలు అవుదాం" అనే నినాదంతో మెగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెద్దాపురం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలోని గోకులం లే అవుట్లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విరవాడలో ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవలందిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని విరవాడ గ్రామంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆహారం విషయంలో జాగ్రత్తలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.స్వాతి, దరియా, భావన ప్రియ మరియు సానా సతీష్ బాబు ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను కాపాడుదాం..

ప్రజాశక్తి - అన్నవరం

ఆడపిల్లలను కాపాడుదాం... ఉన్నతంగా చదివిద్దామని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి డిసిపిఒ వెంకట్ అన్నారు. అన్నవరం దేవస్థానంలో పనిచేసే పురోహితులకు బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో వివాహం చేసేటప్పుడు పెళ్ళికూతురు వయసు కేవలం స్టడీ సర్టిఫికెట్ ఆధారంగా మాత్రమే ధృవీకరించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండని ఆడపిల్లలకు ఎట్టి పరిస్తుల్లోనూ బాల్యవివాహ చేయరాదని, అలా చేసినవారందరి మీద చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పురోహితులు వాటిని గమనించి బాల్య వివాహ నిరోధక కమిటీకి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సాధికారిక అధికారిని కె.ప్రవీణ, సిడిపిఒ పద్మావతి, గ్రామ సర్పంచ్ ఎస్.కుమార్ రాజా, మండల ఉపాధ్యక్షుడు దారా వెంకటరమణ, శంఖవరం పిహెచ్‌సి వైద్యులు రాజీవ్, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు

25న కేంద్ర మంత్రి రాక

ప్రజాశక్తి - యానాం

కేంద్ర మత్స్యశాఖ, సమాచార,ప్రసార మంత్రిత్వశాఖల సహాయమంత్రి ఎల్.మురుగన్, రాజ్యసభ సభ్యుడు, పుదుచ్చేరి బిజెపి అధ్యక్షుడు సెల్వ గణపతి ఈ నెల 25న యానాం రానున్నట్లు యానాం బిజెపి శాఖ అధ్యక్షుడు కనకాల రాజు తెలిపారు.